


కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఎలాంటి కేటాయింపులు జరగకపోవడం నిరాశను కలిగించింది. అంతేకాకుండా మెట్రోరైలు విస్తరణ, కృష్ణా రైల్వే ప్రాజెక్టు, హైస్పీడ్ రైళ్లపై కూడా ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే కేంద్ర బడ్జెట్ వేతన జీవులు, మధ్యతరగతి వర్గాలతో పాటు రైతులకు ప్రయోజనకరంగా ఉంది. ఆదాయపన్నుకు సంబంధించి వేతనజీవులకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకున్నారు. రైతులకు తక్కువ వడ్డీకి ఇచ్చే కిసాన్ క్రెడిట్‌కార్డుల రుణపరిమితిని కేంద్రం రూ.3లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచింది. అలాగే సూక్ష్మ సంస్థలకు భారీగా నిధులు కేటాయించారు. దీంతో ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలకు చేయూత లభించనుంది.

- కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు శూన్యం
- వేతన జీవులకు ఊరట
- ఆదాయపన్నులో వెసులుబాటు
- రైతాంగానికి తీపి కబురు
- కంది రైతులకు మంచి రోజులు
- కేంద్ర ఏజెన్సీల ద్వారా నేరుగా కంది కొనుగోలు
- ఎంఎస్‌ఎంఈలకు భారీగా రుణాలు పెంపు
- జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు



ఆశలపై నీళ్లు!

ప్రాజెక్టులకు మొండిచేయి



ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి : కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలో తలపెట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ఊసే లేదు. ఉమ్మడి జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్న పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే కేంద్రాన్ని కోరింది. అయితే ఈ బడ్జెట్‌లో ఈ విషయం అసలు ప్రస్తావనకే రాలేదు. అలాగే నగర శివార్లలో ఏర్పాటు చేయదలిచిన ఫ్యూచర్ సిటీకి మెట్రోరైలు విస్తరణ, కృష్ణా రైల్వే ప్రాజెక్టు, హైస్పీడ్ రైళ్లపై ఇంత వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. రైల్వేకి సంబంధించిన బడ్జెట్ పూర్తి వివరాలు రావడానికి కొంత సమయం పట్టవచ్చు. అయితే కీలక అంశాలు ముందుగానే వెల్లడించే అవకాశం ఉన్నా ఇంత వరకు వీటిపై ఎలాంటి ప్రకటన రాకపోవడంతో కీలక ప్రాజెక్టులు అటకెక్కినట్టుగానే భావిస్తున్నారు. ఇదిలా ఉంటే కేంద్ర బడ్జెట్ వేతన జీవులకు మధ్య తరగతి వర్గాలతో పాటు రైతులకు ప్రయోజకరంగా ఉంది. ఆదాయపన్నుకు సంబంధించి వేతనజీవులకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.12లక్షల వరకు ఆదాయం కలవారికి పూర్తిగా పన్నుమినహాయింపు లభించనుంది. అయితే సేవింగ్స్ చేసే వారికే ఈ పూర్తి ప్రయోజనం కలగనుంది. గతంలో ఉన్న శ్లాబ్ విధానాలను సవరించారు. కొత్త విధానం వల్ల వేతన జీవులకు ఏడాదికి గరిష్ఠంగా రూ. 1.10లక్షల వరకు ఆదా కానుంది. పీఎం ఆరోగ్య యోజన కింద గిగ్ వర్కర్లకు అంటే స్విగ్గీతో పాటు ఆన్‌లైన్ డెలివరీ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు బీమా పథకాన్ని అమలు చేయనున్నారు. వృద్ధులకు వడ్డీపై వచ్చే ఆదాయానికి సంబంధించి వెసులుబాటు కల్పించారు. టీడీఎస్ పరిమితి రూ.50 నుంచి రూ.లక్ష వరకు పెంచారు. అలాగే గతంలో

మిగతా 8వ పేజీలో...

ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహం

సూక్ష్మ సంస్థలకు భారీగా నిధులు కేటాయించారు. దీంతో ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలకు చేయూత లభించనుంది. ఎంఎస్‌ఎంఈ రుణాలను రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు రుణపరిమితి పెంచడంతోపాటు స్టార్టప్ లకు రూ.20 కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నారు. 27 రంగాల్లో స్టార్టప్ రుణాలకు ప్రత్యేక కార్యాచరణ నమోదు చేసుకున్న సంస్థలకు రూ. 5లక్షల వరకు క్రెడిట్ కార్డు రుణం ఇవ్వనున్నారు. సూక్ష్మ పరిశ్రమలు ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో అధికంగా ఉన్న విషయం తెలిసిందే. రుణ ప్రోత్సాహంతో వేలాది మందికి ప్రయోజనం దక్కనుంది. మహిళా సాధికారత, సంక్షేమమే ధ్యేయంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల మహిళల కోసం ప్రత్యేక టర్మ్ లోన్ పథకాన్ని తీసుకురానున్నారు.. కొత్తగా వ్యాపారం చేయాలనుకునే ఆయా వర్గాల మహిళలకు వచ్చే ఐదేళ్లలో రూ.2 కోట్ల వరకు రుణాలను ఈ పథకం కింద అందిస్తారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది మహిళలకు లబ్ధి చేకూరనుంది. అలాగే ఈ పథకం ద్వారా దేశంలోని ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన మహిళలకు కొత్త ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. విదేశాల్లో చదువుకునేందుకు విద్యార్థులు తీసుకునే విద్యా రుణాలపై ప్రస్తుతం వసూలు చేస్తోన్న టీసీఎస్(ట్యాక్స్ కలెక్షన్ ఎట్ సోర్స్)ను పూర్తిగా ఎత్తేసింది. దీంతో పాటు విదేశాలకు చేసే నగదు బదిలీలపై వసూలు చేసే టీసీఎస్ మినహాయింపు పరిమితిని రూ.7లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచింది. దీంతో తమ పిల్లలను విద్య కోసం విదేశాలకు పంపే తల్లితండ్రులకు కొంత ఆర్థిక ఊరట లభించింది.

ఎవరేమన్నారంటే..?

జనరంజక బడ్జెట్



కేంద్ర బడ్జెట్ లెక్కల పద్దు కాదు.. మోదీ దార్శనికత, స్వావలంబన, వృద్ధి, శ్రేయస్సుతో కూడిన వికసిత్ భారత్ నిర్మించే బడ్జెట్. రైతు సంక్షేమం నుంచి మధ్య తరగతి ఉపశమనం వరకు, మహిళలు, యువతకు సాధికారత, పెట్టుబడులను ప్రోత్సహించడం వరకు, ఈ బడ్జెట్ దేశంలోని ప్రతీ ఒక్కరి కలను సాకారం చేసేలా ఉంది. రూ. 12 లక్షల ఆదాయంపై పన్ను రద్దు విప్లవాత్మకం. తెలంగాణలోని ఒక్కో ఉద్యోగికి రూ. 80 వేల వరకు ఆదా కానుంది. 75 ఏళ్లలో మునుపెన్నడూ లేని విధంగా మధ్య తరగతికి అనుకూలమైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు.

బొక్క నర్సింహ్మరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

తెలంగాణకు అన్యాయం



కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ గురించి ప్రస్తావనే లేదు. బీజేపీకి తెలంగాణ నుంచి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా దండగే. బడ్జెట్‌లో తెలంగాణ అన్యాయం జరిగింది. ఉపాధిహామీ పథకానికి కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. తాగునీటి ప్రాజెక్టుల ఊసే లేదు. పెట్రోల్, డీజిల్ సుంకాలను పెంచేలా బడ్జెట్ ఉంది. పేదల వద్ద అత్యధికంగా వసూలు చేసిన జీఎస్టీ బిల్లులు దోచి కార్పొరేట్ శక్తులకు అప్పజెబుతురు. నిరుద్యోగుల సమస్యను పరిష్కరించేలా బడ్జెట్ లేదు. ధరల నియంత్రించే విధంగా లేదు.

పాల్మాకుల జంగయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

కొంచెం మోదం.. కొంచెం ఖేదం



కేంద్ర బడ్జెట్ కొందరికి మాత్రమే ప్రయోజనకరంగా ఉంది. నూతన పన్ను విధానంలో 12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఊరట కలిగించే అంశం. పాత పన్ను విధానంలో సేవింగ్స్‌ను ఐదు లక్షల వరకు పెంచితే బాగుండేది. ఉద్యోగ, ఉపాధ్యాయులు వార్షిక ఆదాయం రూ.16 లక్షలు దాటితే 20 శాతం పన్ను పరిధిలోకి రావడం ఊరట కలిగిస్తున్న అంశమే. రాబోయే ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా డిజిటల్ లెర్నింగ్ వనరుల యాక్సెస్ కోసం రూ.50 వేల పాఠశాలలో అట్ టింకరింగ్ ల్యాబ్ నెలకొల్పేందుకు తీసుకున్న నిర్ణయం హర్షణీయం.

ఏవీ సుధాకర్, ఎస్టీయుటీఎస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి

బడ్జెట్ అంతా మాయ



కేంద్ర బడ్జెట్ అంతా మాయ. బడ్జెట్ రూ.10 లక్షల కొరతతో నడుస్తుంది. మొత్తం బడ్జెట్‌లో 24 శాతం ఆదాయం అప్పులు చేస్తున్నారు. ప్రభుత్వం ఖర్చు పెట్టే డబ్బులకు 22 శాతం వడ్డీలకే సరిపోతుంది. రాష్ట్రాల నుంచి కేంద్రానికి వెళుతున్న ఆదాయంలో తిరిగి రాష్ట్రాలకు చెల్లిస్తుంది మాత్రం 22 శాతమే. ధనవంతులు తీసుకున్న లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తున్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న తరుణంలో పేదలపై పన్నులు వేయడం సరైంది కాదు. సామాజిక అంశంపై బడ్జెట్ కుదించారు. పారిశ్రామిక రంగానికి చాలా వరకు తగ్గించారు.

కె. భాస్కర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

పెట్టుబడిదారులకు అనుకూలం



ఇది పేదల బడ్జెట్ కాదు.. పెట్టుబడిదారులు, కార్పొరేటర్లకు అనుకూలంగా ఉంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొన్ని రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారు. రూ.50,65,345 లక్షల కోట్ల బడ్జెట్‌లో గ్రామీణ పేదలకు రాయితీలను కట్ చేసి.. బడా కార్పొరేట్లకు రాయితీలను ఇచ్చింది. ఉపాధిహామీ రూ.86 వేల కోట్లు మాత్రమే బడ్జెట్‌లో చూపింది. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి ఉన్న జిల్లాకు చేసిందేమీ లేదు. నిధులు రాబట్టడంలో ఘోరంగా విఫలమయ్యారు.

పగడాల యాదయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి

కన్హా శాంతివనానికి మాజీ రాష్ట్రపతి

» మూడు రోజులు బస

షాద్‌నగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శనివారం సాయంత్రం నందిగామ మండలంలోని కన్హాశాంతి వనానికి చేరుకున్నారు. మూడు రోజుల పాటు అక్కడే ఆయన బస చేస్తారు. ఈ క్రమంలో శాంతివనంలో జరిగే యోగ, ధ్యానం తదితర కార్యక్రమాల్లో కోవింద్ పాల్గొనున్నట్టు సమాచారం. ఆదివారం ఇక్కడ జరిగే ధ్యాన కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి పాల్గొంటారు. అలాగే యోగ, ధ్యానంపై ఆయన ప్రసంగిస్తారని తెలిసింది. కాగా మాజీ రాష్ట్రపతి పర్యటనపై మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

ఆట స్థలం పరిశీలన

చౌదరిగూడ, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న స్పోర్ట్స్ గ్రౌండ్ స్థలాన్ని జిల్లా అధికారులు పరిశీలించారు. శనివారం కొందుర్గు మండల కేంద్రంలోని సర్వే నంబరు 19, విస్తీర్ణం 7.17 గుంటలో నిర్మించనున్న గ్రౌండ్ స్థలాన్ని మండల రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసి గ్రౌండ్ స్థలాన్ని సంబంధించిన సర్వే రిపోర్టును జిల్లా స్పోర్ట్స్ అధికారులకు మండల రెవెన్యూ అధికారులు అప్పగించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సుదాకర్, డిప్యూటీ తహసీల్దార్ రాకేష్, ఆర్ఐ శివ, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి


ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

» జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మార్చి 5వ తేదీ నుంచి రోజూ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించే ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు చేపట్టాల్సిన పనులను సమన్వయంతో చేయాలన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు యంత్రాంగాన్ని నియమించి, డివిజన్ స్థాయి అధికారులతో వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేయాలన్నారు. ఆర్డీవో కార్యాలయాల్లో ఎగ్జామ్ సెల్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్ష విధులు నిర్వహించే ప్రతీ అధికారి బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సెంటర్లలో తప్పిదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలో 185 పరీక్ష కేంద్రాల్లో 77,863 మంది ఫస్టియర్ విద్యార్థులు, 69,348 మంది సెకండియర్ విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 31 ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లుంటాయని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష సమయాల్లో సెంటర్ల సమీప అన్ని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను నడపాలని, కేంద్రాల వద్ద ఫస్టెయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మెడిసిన్‌తో మెడికల్ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్లకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. పోస్టల్ శాఖ జవాబు పత్రాలను సరిగ్గా సేకరించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో తాగు నీరు, ఫ్యాన్లు, టాయిలెట్స్ సరిగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కందుకూరు, ఇబ్రహీంపట్నం చేవెళ్ల ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, చంద్రకళ, ఇంటర్ బోర్డు జిల్లా అధికారి వెంక్యానాయక్, డీఈవో సుశీందర్‌రావు, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషరేట్ల, పోస్టల్ శాఖ, ఆర్టీసీ, విద్యుత్, వైద్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి



యాచారం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కార్యాలయానికి పనుల కోసం వచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని, వారి ఆవేదన విని తమ పరిధిలోని సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం యాచారం తహసల్దార్ టి.అయ్యప్పను ఆదేశించారు. కార్యాలయాన్ని సందర్శించి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. 'భూముల రిజిస్ట్రేషన్‌కు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తున్నారా? రిజిస్ట్రేషన్‌కు ఎంత సమయం తీసుకుంటున్నారు?' అని కోదండరెడ్డి రైతులను అడిగి తెలుసుకున్నారు. మేడిపల్లి రైతు కలకొండ రామచంద్రి తనకు ఐదుగురు కుమార్తెలు, ఓ కొడుకు ఉన్నారని.. కుమార్తెలకు కూడా కొంత భూమి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నానని కోదండరెడ్డికి చెప్పడంతో ఆయనను అభినందించారు. కుమారుడిని ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. తన పరిధిలో 434, ఆర్డీవో పరిధిలో 166 ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ వివరించారు.

'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

» జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతిభీంభరత్



కాంగ్రెస్ మహిళా నేతలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతిభీంభరత్ అన్నారు. శనివారం జిల్లాలో ఏ-బ్లాక్, బీ-బ్లాక్, మండల, మున్సిపల్ మహిళా కమిటీలను ఏర్పాటు చేశారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా రమ్యశ్రీరెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ లేడీ వింగ్ అధ్యక్షురాలిగా చంద్రికగౌడ్, మహేశ్వరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా సమతను నియమించారు. ఈ రెండు నియోజకవర్గాల్లో 70 మందితో మహిళా కమిటీలను ఏర్పాటు చేశారు. వీరందరికీ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు నియామకపత్రాలను అందజేశారు. గాంధీ భవన్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ తదితర పథకాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏ-బ్లాక్ అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



▲ మాట్లాడుతున్న అంజయ్య యాదవ్

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

» మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

» లంబాడ హక్కుల పోరాట సమితి దీక్షకు సంఘీభావం

షాద్‌నగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఈనెల 15వ తేదీని సెలవు దినంగా ప్రకటించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం షాద్‌నగర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం అంజయ్య యాదవ్ మాట్లాడుతూ గిరిజనుల మనోభావాలను గమనించి ఫిబ్రవరి 15లోగా సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. రాంబల్ నాయక్ మాట్లాడుతూ గోర్ గోలి భాషను మాట్లాడుతున్న 12 కోట్ల మంది గిరిజనులకు న్యాయం జరిగేలా గోర్ బోలి భాషను అధికారిక భాషగా ప్రకటించాలని కోరారు. గోవాలో 30 లక్షల మంది మాట్లాడే కొంకిణి భాషను అధికారికంగా ప్రకటించారనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

పథకాలపై అవగాహన తప్పనిసరి

» కేంద్ర వైద్యబృందం

» షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి సందర్శన

షాద్‌నగర్, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి) కేంద్ర ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పిస్తూ, అవి పేదలకు అందేలా చూడాలని కేంద్ర వైద్య బృందం సూచించింది. శనివారం బృందంలోని అధికారులు డాక్టర్ కవిత, డాక్టర్ మాల్విక షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిని తనిఖీ చేశారు. జాతీయ వైద్య ఆరోగ్య మిషన్ కింద ప్రకటించిన వ్యాధులకు సంబంధించి వాటి నివారణ, చికిత్స విధానం గురించి షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, కమ్యూనిటీ ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ మాధవిని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ క్షయ నిర్మూలన, లెప్రసీ, వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, బోదకాలు నివారణతో పాటు మలేరియా నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగారు. అలాగే ఆస్పత్రిలో ఉన్న రికార్డులతో పాటు ఫార్మసీ, ల్యాబ్, ఓపీ సేవలు, ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ సెంటర్‌ను సైతం పరిశీలించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ పేదల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇవ్వాల్సిన నిధులపై కేంద్ర వైద్య ఆరోగ్య శాఖకు నివేదిక అందజేస్తామని తెలిపారు. జిల్లా ప్రోగ్రాం అధికారి ఎన్‌హెచ్‌ఎం అక్రమ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌తో పాటు ఆస్పత్రిలోని వైద్యులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డాక్టర్ కవిత





సంపులో పడి చిన్నారి మృతి

పాలిషింగ్ యూనిట్ వద్ద తల్లిదండ్రుల రోదన

తాండూరు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ ఇంట్లోంచి బయటకు వెళ్లిన చిన్నారి సంపులో పడి మృతిచెందింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గౌతాపూర్-చించోళి రోడ్డులోని పాలిషింగ్ యూనిట్‌లో శనివారం చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం బేగంపూర్ తాలూకా పూర్ణియా ప్రాంతానికి చెందిన వలస కుటుంబంమెహరాజ్ ఖాతూన్, హసీనా దంపతులు గౌతాపూర్ శివారులోని అజార్ పాలిషింగ్ యూనిట్‌లో నాపరాతి గనిలో పనిచేస్తున్నారు. వారికి కూతురు మహీఖాతూన్(మూడున్నరేళ్లు), కొడుకు సహేట్ ఉన్నారు. వీరు ఆరు నెలలుగా ఈ పాలిషింగ్ యూనిట్‌లో పనిచేస్తున్నారు. శనివారం ఉదయం 7గంటల సమయంలో యూనిట్ పైభాగం గదిలో నుంచి చిన్నారి మహి ఆడుకుంటూ బయటికొచ్చింది. ప్రమాదవశాత్తు గది వెనుక ఉన్న సంపులో పడిపోయింది. కూతురు కనిపించక తల్లిదండ్రులు వెతికారు. సంపులో చూసి మహీఖాతూన్‌ను గుర్తించారు. వెంటనే చిన్నారిని సంపులో నుంచి బయటికి తీసి తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి తాండూరు శివారులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి చిన్నారి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో ఈ సంఘటనపై చిన్నారి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

ఆశలపై నీళ్లు!

(7వ పేజీ తరువాయి)

అద్దె ద్వారా వచ్చే ఆదాయం 2.5లక్షలకు మించితే పన్ను విధించేవారు. ఇప్పుడు ఈ మొత్తాన్ని రూ.6లక్షలకు పెంచారు. తాగునీటికి ప్రాధాన్యత పెంచారు. 100 శాతం ఇళ్లకు కుళాయి నీటి సరఫరా చేసేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. క్యాన్సర్ దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులకు కస్టమ్స్ డ్యూటీ నుంచి పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని పీహెచ్‌సీలకు భారత్ నెట్ ప్రాజెక్టు కింద ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వనున్నారు.

రైతులకు తీపి కబురు

రైతులకు తక్కువ వడ్డీకి ఇచ్చే కిసాన్ క్రెడిట్‌కార్డుల రుణపరిమితిని కేంద్రం రూ.3లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచింది. దీంతో ఉమ్మడిజిల్లాలోని దాదాపు 8 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. కిసాన్ క్రెడిట్‌కార్డు పథకం కింద రైతులకు 9శాతం వడ్డీతో రుణాలు ఇస్తున్నారు. ఇందులో ప్రభుత్వం 2శాతం వడ్డీ భరిస్తుంది. సకాలంలో వడ్డీ చెల్లిస్తే రైతులకు 3శాతం వడ్డీ రాయితీ ఇస్తున్నారు. మొత్తం మీద చూస్తే నాలుగు శాతానికే రైతులకు వడ్డీ పరిమితం కానుంది. పప్పుధాన్యాల స్వయం సమృద్ధి కోసం మిషన్ ఫర్ ఆత్మ నిర్భరత ఇన్ పల్సెస్ అనే పథకాన్ని అమల్లోకి తీసుకురానుంది. దీని కింద కంది, మినుము, మసూర్ వంటి పప్పుధాన్యాలు పండించే రైతుల ఉత్పత్తులు కొనేందుకు ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది. కేంద్ర ఏజెన్సీల ద్వారా వీటిని కొనుగోలు చేయనుంది. ఈ నిర్ణయంతో కంది అత్యధికంగా పండించే వికారాబాద్ జిల్లా రైతాంగానికి మేలు జరగనుంది. ముఖ్యంగా తాండూరు రైతులకు ఎక్కువ ప్రయోజనం కలగనుంది. అలాగే ప్రధానమంత్రి ధన్ ధాన్య యోజన కింద వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం ఇవ్వనున్నారు. గోదాములు, నీటి పారుదల, రుణ సౌకర్యం కల్పనకు భారీగా నిధులు కేటాయించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులకు కూడా లబ్ధి చేకూరనుంది. దేశంలోని అన్ని జిల్లా ఆస్పత్రుల్లో మూడేళ్లలో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో మూడు జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటవుతాయి.

ధారూరులో కంది, వేరుశనగ బీట్లు

ధారూరు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం కందులు క్వింటాలుకు రూ.7,150 నుంచి రూ.7,330ల వరకు, వేరుశనగ క్వింటాలుకు రూ.5,050ల నుంచి రూ. 6,200ల వరకు ధర పలికాయి. కాగా కందులు 796 క్వింటాళ్లు, వేరుశనగ 330 క్వింటాళ్లు క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.




















క్రాప్‌లోన్ పెంపు హర్షణీయం

రాజిరెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



శంషాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా క్రాప్ లోన్ రూ. మూడు నుంచి ఐదు లక్షలకు పెంచడం చాల హర్షణీయమని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ రైతులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. కంది, మినుము, మసూర్లు కొనడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. 7.7 కోట్ల మంది దేశ రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందుబాటు ఉన్నాయని ఆయన అన్నారు.

అన్ని వర్గాలకు మేలు

సాధ మల్లారెడ్డి, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు



కందుకూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా ఉందని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, కొత్త గూడ మాజీ సర్పంచ్ సాధ మల్లారెడ్డి అభి ప్రాయపడ్డారు. బడ్జెట్ కేటాయింపులు మధ్యతరగతి, ఉద్యోగ, బలహీన వర్గాలు, మహిళలకు పెద్దపీట వేస్తూ అన్ని వర్గాలకు ఊరట కలిగించింది. పన్నుల శ్లాబ్స్ మినహాయింపులు, వైద్యారోగ్య శాఖల కు సంబంధించి ప్ర జలకు ఉపయోగపడేలా కేటాయింపులున్నాయని ఆయన తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

తలకొండపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పండుగ అంజయ్య అన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. మండల పరిధిలోని చుక్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎస్‌జీటీయూ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలను సంఘం నాయకులతో కలిసి అంజయ్య ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు పాండు, సాయిబాబా, రజినీ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్యకర్తలు వెంకటేశ్, మహేశ్, యాదగిరిలను ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. ఉప్పల ట్రస్ట్ ద్వారా రూ.15వేలు సమకూర్చారు. శనివారం బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున అందజేశారు.

లయన్స్‌క్లబ్ సేవలను వినియోగించుకోవాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ జి.చెన్నకిషన్‌రెడ్డి కోరారు. ఈనెల 15న నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే లయన్స్ క్లబ్ రీజియన్ సమావేశానికి సంబంధించి సన్నాహక సమావేశాన్ని పట్టణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.

ఎస్సీ వర్గీకరణకు కదంతొక్కాలి

- 'చలో హైదరాబాద్'ను విజయవంతం చేద్దాం
- ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మద్దిలేటి మాదిగ



షాబాద్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

షాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): లక్ష డప్పులు, వెయ్యి గొంతులు సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయవంతం చేద్దామని, ఎస్సీ వర్గీకరణకు కదంతొక్కుదామని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మద్దిలేటి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గం ఇన్‌చార్జి శంకర్‌రావు మాదిగ అన్నారు. ఈమేరకు షాబాద్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 7న ప్రతీ గ్రామంలో మాదిగలను చైతన్య పరుస్తూ వేయి గొంతులు-లక్ష డప్పుల సభను విజయవంతం చేద్దామన్నారు. ఎమ్మార్పీస్ నాయకులు ముక్కు విశ్వం మాదిగ, నర్సింహా, జోగు అశోక్, రామకృష్ణ, శ్రీశైలం, వెంకట్, రాంచందర్, ప్రవీణ్, దర్శన్, కృష్ణ, సతీష్, రాములు, కృష్ణ, కృష్ణ తదితరులున్నారు.

మొయినాబాద్ రూరల్ : ఎస్సీ రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కొండిగారి మహేందర్ డిమాండ్ చేశారు. లక్ష డప్పులు, వెయ్యి గొంతులకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. మూర్తుజగూడలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మాధవరం శివకుమార్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. మహేందర్ నియామకపత్రాన్ని అందజేశారు.

ఆమనగల్లు : ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మల్లేపోగు మల్లేశ్, పులికంటి మైసయ్యలు ఆరోపించారు. వర్గీకరణ సాధించే వరకూ మాదిగలు విశ్రమించకుండా పోరాడి అంతిమవిజయం సాధించాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షులు కావలి శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమం విజయవంతంపై చర్చించారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల నాయకులు వస్పుల సాయిలు, విజేందర్, జంగయ్య, పుల్లయ్య, అల్లాజీ, అరుణ్, రాము, రమేశ్, శంకర్, సుదర్శన్, బద్ది వెంకటేశ్, శ్రీశైలం, శ్రీరాములు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిభట్ల : ఎస్సీ వర్గీకరణ అమలు కొరకు హైదరాబాదులో తలపెట్టిన లక్ష డప్పులు వేయి గొంతుల ప్రదర్శనకు మాదిగలు పెద్దసంఖ్యలో తరలిరావాలని మాదిగ జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షుడు బోసుపల్లి ప్రతాప్ కోరారు. శుక్రవారం రాత్రి కొంగర కలాన్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. కృపాకర్, శ్రీహరి, ప్రవీణ్, శ్రీనివాస్, రంజిత్‌కుమార్, మహేందర్, వెంకటేష్, ప్రశాంత్ ఉన్నారు.

చౌదరిగూడ : ఎస్సీ వర్గీకరణ అమలుకై హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష గొంతులు వేల డప్పుల ర్యాలీని విజయవంతం చేయాలని కొందుర్గు ఎమార్పీఎస్ మండలాధ్యక్షుడు అనేగళ్ల ఆనంద్ అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమార్పీఎస్ నాయకులు భారీగా తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. పెంటయ్య, ప్రసాద్, నరేందర్, శ్రీను, రాంచంద్రయ్య, ఎలీషా, దర్శన్, వానురి, ప్రభాకర్, అశోక్, చింటూ, సన్ని, రాజు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : లక్షడప్పులు వేల గొంతుల సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివశంకర్ మాదిగ తెలిపారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఎస్సీ వర్గీకరణకు అడ్డుకుంటున్నవారు నోళ్లు మూసుకొని మద్దతునిచ్చేలా కదం తొక్కాలన్నారు. చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు రామస్వామి, రమేశ్, రాములు, కటికెం కృష్ణ, యాదయ్య, తదితరులు ఉన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



నందిగామ : పూజలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ నాయకులు

నందిగామ/ఆమనగల్లు/కేశంపేట/కడ్తాల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దైవచింతనతోనే మానసిక ప్రశాంత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధి బుగ్గోనిగూడలో కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఎమ్మెల్యే పూజలో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, నాయకులు కొమ్ము కృష్ణ, కావలి కృష్ణ, వీరేందర్ గౌడ్, బుగ్గ సాములయ్య, శ్రవణ్, తదితరులున్నారు. కాగా, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కడ్తాల్, కల్వకుర్తి, ఆమనగల్లు, వెల్దండ మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ బాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎంగళపల్లి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో జరిగే బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే కు నిర్వాహకులు అందజేశారు. భూపతిరెడ్డి, ఆనంద్, సంజీవ, శ్రీకాంత్ రెడ్డి, తదితరులున్నారు. కేశంపేట మండల కేంద్రంలోని దవళగిరి గుట్టపై వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో భక్త మార్కండేయ జయంతిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కడ్తాల మండలం మక్తమాదారం వేణుగోపాల స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. తొలిరోజు స్వామివారికి అభిషేకం, స్వస్తివాచనం, అంకురార్పణం, ప్రత్యేక పూజలు, రక్షాబంధనం నిర్వహించారు. ధర్మకర్త రామానుజాచార్యులు, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, మాజీ సర్పంచ్ సులోచనసాయిలు, ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్ : అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

'విజయ తెలంగాణ' పుస్తకావిష్కరణకు రండి



సీఎంను ఆహ్వానిస్తున్న వీరేందర్‌గౌడ్, విజయేందర్‌గౌడ్

మహేశ్వరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : మాజీ హోంమంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ రచించిన విజయ తెలంగాణ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో దేవేందర్‌గౌడ్ కుమారులు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, విజయేందర్‌గౌడ్‌లు ఆహ్వాన పత్రికతో కలిశారు. ఈ నెల 14న జలవిహార్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం హాజరవుతానని తెలిపారని వారు చెప్పారు.

నాణ్యమైన భోజనం అందించాలి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో సుశీందర్‌రావు సూచించారు. ముచ్చింతల్ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. అపార్ వివరాలను తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలు పెంపొందించే అంశంలో ఎఫ్ఎల్ఎన్, ఎల్ఈపీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పాఠశాల ఆవరణలో సేంద్రియ ఎరువుల ద్వారా పెంచిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. ఋషి ఫౌండేషన్ ద్వారా స్పోర్ట్స్ డ్రెస్‌లు, మైహోం సంస్థ ద్వారా విద్యార్థులకు బెల్టులు, టై, షూస్‌లు ఆయన అందించారు.

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది



సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

కొత్తూర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ ఎస్సీ సెల్ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దకు విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభనుద్దేశించి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై స్పష్టత ఇవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేని విధంగా ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఎస్సీ వర్గానికి చెందిన ఉన్నతాధికారిని నియమించడం జరిగిందని, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉస్మానియా వీసీ నియమించడం కాంగ్రెస్ ప్రభుత్వం ఘనతని అన్నారు. ఈనెల 7న జరిగే వేల గొంతులు, లక్షల డప్పుల సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతగా తీర్మానం చేస్తామన్నారు. నాయకులు చిలకమర్రి నర్సింహ, హసన్, జెనిగె శివ, సాయితేజేశ్వర్, రాజేందర్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

'రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి'

ఆదిభట్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఆదిభట్ల మున్సిపల్ అధ్యక్షుడు బాల్‌రాజుగౌడ్ తెలి పారు. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం అభివృద్ధి చెందాలంటే సీనియర్ ఎమ్మెల్యే రంగారెడ్డికి మంత్రి పదవిలో చోటు కల్పించాలని సీఎంను కోరారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటున్న రంగన్నకు మంత్రి పదవి ఇవ్వకుంటే నియోజకవర్గంలోని 4 మున్సిపల్, 4 మండలాలకు చెందిన కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి మూకుమ్మడిగా రాజీనామా చేస్తామన్నారు.

ఎండిన మొక్కల స్థానంలో కొత్తవి నాటిస్తాం : ఎంపీడీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో హరితహారం పథకం కింద నాటిన మొక్కలు ఎండిపోయాయి. అయితే, ధర్మన్నగూడలో మొక్కలకు నిప్పు పెట్టిన వైనంపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ఎండకు ఎండుతూ.. అగ్నికి ఆహుతవుతూ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి స్పందించారు. మొక్కలకు నిప్పంటించడం పట్ల ఆయన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎండిపోయిన మొక్కల స్థానంలో తిరిగి కొత్తగా మొక్కలు నాటించనున్నట్లు వెల్లడించారు. విధిగా మొక్కలకు నీరు పెట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో మొక్కలు ఎండిపోకుండా తగిన చొరవ తీసుకోవాలన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ప్రతినిధులు, నాయకులు

చేవెళ్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని కుమ్మెర ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బలరాం తెలిపారు. నగరంలోని ఎన్‌సీఆర్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ.25 లక్షలతో కుమ్మెర ప్రభుత్వ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించారు. పెయింటింగ్, కంప్యూటర్లు, టీవీని సమకూర్చారు. ఈ మేరకు శనివారం పాఠశాల ఆవరణలో అభివృద్ధి పనుల నిమిత్తం వేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎన్‌సీఆర్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్, మాజీ సర్పంచ్ పాండుగౌడ్, హన్మంత్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శంకర్‌యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యాలయం ప్రారంభం

మాడ్గుల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిళ్ల పరిధి కొర్రతండాలో గ్రామ పంచాయతీ కార్యాలయం లేక ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. పనుల నిమిత్తం కొర్రతండా నుంచి నాగిళ్లకు దాదాపు 3 కిలో మీటర్లు నడిచి వెళ్లవలసి వచ్చేది. తండావాసులు తండా ఇటీవల గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి గ్రామ సచివాలయం ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించారు. కొర్రతండా ప్రాథమిక పాఠశాలలో కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మావతి చెప్పారు. శనివారం గ్రామస్తులతో కలిసి భవనాన్ని ప్రారంభించారు.

ఘనంగా జయేందర్ జన్మదిన వేడుకలు



పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సురేందర్ ముదిరాజ్

కందుకూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి : ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు కుర్మమోని జయేందర్‌ముదిరాజ్ జన్మదిన వేడుకలు శనివారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ముదిరాజ్ మహాసభ మండల ప్రధాన కార్యదర్శి కొర్వి సురేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆ సంఘం నేతలతో కలిసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు పిట్టల పాండుముదిరాజ్, నాయకులు పి.జయమ్మ జంగయ్య, నర్సింహ, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చేవెళ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో నిర్వహించిన వైద్యశిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి తెలిపారు. శనివారం టీఎక్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో చేవెళ్ల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉచిత శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు ఉచితంగా అన్నిరకాల వైద్యపరీక్షలు చేశారు. వైద్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సంగాయిపల్లి గ్రామస్తులు

సంగాయిపల్లిని జీపీగా ఏర్పాటు చేయాలి

తలకొండపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగాయిపల్లి గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కాగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. నాయకులు వెంకటయ్య, మహేందర్, రాములు, కేశవులు, బాలకృష్ణ, సుధాకర్, జంగయ్య, చంద్రయ్య, సాయిలు, శేఖర్, వినోద్, తదితరులు కసిరెడ్డిని కలిశారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న భీంభరత్, సురేందర్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో 8 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.4.52లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదన్నారు. కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు చంద్రయ్య, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్లు అక్తర్ పాష, శ్రీరాంరెడ్డి, మాజీ ఎంపీటీసీలు రవీందర్, చెన్నయ్య, అశోక్, నాయకులు పీసరి వెంకట్‌రెడ్డి, పెంటారెడ్డి, అక్మత్‌పాష, రవీందర్‌రెడ్డి, బందయ్య, సురేందర్, మల్లారెడ్డి, జాంగీర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు ప్రారంభం



తిప్పాయిగూడకు బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న సీఐ మధు

మంచాల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నుంచి చౌటుప్పల్ వయా తిప్పాయిగూడ మీదుగా నడిచే అదనపు బస్సు సర్వీసును మంచాల సీఐ మధు ప్రారంభించారు. తిప్పాయిగూడ-చౌటుప్పల్ మీదుగా ఇబ్రహీంపట్నం చేరుకొని ఇటుగా చేరాల్సి వచ్చేది. ఈవిషయమై పలుమార్లు స్థానిక నేతలు ఆర్టీసీ అధికారులను కలిసి వినతులు అందజేయడం తెలిసిందే. బస్సు సర్వీసుతో ప్రయాణ కష్టాలు తొలుగుతాయని నారాయణపురం గ్రామస్తులు తెలిపారు. గోరె వీరేష్‌గౌడ్, జెనిగె కొమురయ్య, గోరెంకల చంద్రయ్య, యాదయ్య, సురేష్, అయిలయ్య, జగదీష్‌రెడ్డి, ఎస్సై సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నక్షబాట కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

కేశంపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో కొందరు అక్రమార్కులు నక్షబాట కబ్జా చేస్తున్నారని బాధిత రైతులు శనివారం కేశంపేట తహసీల్దార్ మీర్ అజంఅలీకి ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 194, 191, 159/3, 159/ఆ/5, 159/4, 159/6/6లలో 30 ఎకరాల వ్యవసాయ భూమికి ఆనుకొని ఉన్న నక్షబాటను అల్వాలకు చెందిన మంగలి పాండుతో పాటు మరికొంత మంది కబ్జా చేస్తున్నారని తెలిపారు. వారికి అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీస్ కేసులు పెట్టిస్తామని భయాందోళనకు గురిచేస్తున్నారని ఫిర్యాదు పేర్కొన్నారు. నక్షబాటను కాపాడి రైతులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. అలాగే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రొల్ల యాదయ్య రాజు, భూపాల్, అంజయ్య, దామోదర్, మల్లేష్, నర్సింహులు పాల్గొన్నారు.

మత్స్య మహిళా జాతీయ సదస్సును విజయవంతం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న బాలకృష్ణ తదితరులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే మత్స్య మహిళా జాతీయ సదస్సును జయప్రదం చేయాలని మత్స్య కార్మిక సంఘం జాతీయ నాయకుడు ఎల్.బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ పిలుపునిచ్చారు. శనివారం నర్కూడ గ్రామ సొసైటీ ఆధ్వర్యంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. దేశంలోనే మొదటిసారిగా రెండు రోజులపాటు 300 మంది మత్స్యకార మహిళలతో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. నర్కూడ మత్స్య సొసైటీ కార్యదర్శి మల్లేష్, మహిళ సొసైటీ రాష్ట్ర నాయకురాలు నీరటి అనురాధ, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'అన్నప్రసాద వితరణ'కు విరాళం



విరాళం ఇస్తున్న పాండురంగం

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్ర జ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 22వ వార్డులో గల కట్టమైసమ్మ ఆలయంలో అన్నప్రసాద వితరణ కోసం స్థానిక వెంకటరమణ జూ వెల్లరీ యజమాని పలబట్ల పాండురంగం గుప్త రూ.1,00,100 విరాళంగా ఇచ్చారు. కాగా, ప్రతీ అమావాస్యకు ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ఆలయ నిర్మాణ సమయంలో రూ.రెండు లక్షలు విరాళంగా ఇచ్చిన పాండురంగం ప్రసాద వితరణకు మరోసారి విరాళం ఇచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నలమోని శ్రీధర్‌కు శనివారం విరాళం అందజేశారు. పాండురంగం కుటుంబ సభ్యులకు శ్రీధర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పలబట్ల శివకుమార్, ఆలయ కమిటీ సభ్యులు ఏదెల్లి శ్రీనివాస్, మంచిర్యాల సురేష్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం

మంచాల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరంలాంటిదని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేష్ అన్నారు. ఆరుట్లకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఎల్లేష్ మాట్లాడుతూ ఈ పథకంతో పేదకుటుంబాలకు లబ్ధిచేకూరుతోందన్నారు. మాజీ సర్పంచులు పండరి, యాదయ్య, బాష, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

కేశంపేట : బీజేపీ కేశంపేట మండలాధ్యక్షురాలు రొల్ల రాధికను బీజేవైఎం నాయకులు ఘనంగా సన్మానించారు. బీజేవైఎం మండలాధ్యక్షుడు పాలాది శ్రీనివాస్ ఆధ్వర్యంలో అల్వాలకు వెళ్లి ఆమె నివాసంలో శాలువాతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి తమ వంతుగా కృషి చేస్తామని అధ్యక్షురాలికి హామీ ఇచ్చారు. నాయకులు మధుసూదన్ గౌడ్, రమేష్ గౌడ్, తట్టిపల్లి నర్సింహ తదిరుతుల పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలిచేలా నాయకులు, కార్యకర్తలను సిద్ధం చేయాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించినట్లు చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ తెలిపారు. వికారాబాద్ పర్యటనకు వెళ్తున్న స్పీకర్‌ను భీంభరత్, సీనియర్ నాయకులు పురాణం వీరభద్రస్వామి, మండలాధ్యక్షుడు మానయ్యలు మార్గమధ్యలో కలిశారు. స్పీకర్ వారికి పలు సూచనలు చేసినట్లు నాయకులు తెలిపారు.

యాచారం : శ్రీ శ్యామలాదేవీ ఉత్సవాల సందర్భంగా మండలంలోని శ్రీ జ్ఞానసరస్వతీ మాత ఆలయం ప్రాంగణంలో పాఠశాలల బాలబాలికలకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్ మండలాలకు చెందిన 18 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. శతకపద్యాలు, భగవద్గీత, రామాయణం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలను ఎంఈవో పాండురంగారెడ్డి, మంచాల ఎంఈవో రాందాస్, ఆలయ ఫౌండర్ సదావెంకటరెడ్డి తదితరులు సత్కరించి బహుమతులు అందించారు.

తలకొండపల్లి : మండల కేంద్రం ఏర్పాటు కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించిన 11 కొత్త మండలాల జాబితాలో గట్టిప్పలపల్లి పేరు లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 93వ రోజుకు చేరాయి.